# వల్మీకం

"చరిత్రంటే గాయమేగా! ఊరవతల వేసిన కేకలేగా!" గంటసేపటినుంచీ కుస్తీపడుతున్నా, అంతకుమించి మరో వాక్యం రావడంలేదు. కట్టలుతెగిన వరదలా అనేకానేక ఘటనలు – చలం, మనసులో పోటెత్తుతుంటే అక్షరాల ఆనకట్ట అసాధ్యమవుతోంది. ఏవేవో దృశ్యాలు! ఏవీ క్రమపద్ధతిలో కదలటంలేదు.........

తోటలు, తోటల మధ్య ఊరు, ఊరవతల గుడిసెలు, గుడిసెలకు కనుచూపు దూరాన శ్మశానం! కాల్తోన్న జీవితం! కన్నీళ్లు... మౌనంగా నాగావళి నది తరలిపోవటం... అలల మీదుగా 'మాయా మేయ జగంబె నిత్యమని' హరిశ్చంద్ర కాటి సీను పద్యం పాడుతోన్న పెదపాడు లక్ష్మయ్య రాగం!

ఏదో కలకలం! దృశ్యాలు మారిపోయాయి. చీకటి తోటలో గిరగిరా రోధిస్తూ తిరిగే క్రౌంచపక్షి 'అమ్మో... నాయినో' ఆర్తనాదం, గాయపడిన పక్షి ఊరి వీధులన్నిటా తిరిగి తిరిగి ఊరవతల వేసిన కేకలు! చీకటి నూతిలో గొంతుక!

"...బాబో, కొట్టకండి సచ్చిపోతాను. ముస్టోడిని సంపితే పంచమహాపాతకాలు సుట్టుకుంటాయి. సంపకండని గోసబెట్టినా కొట్టేరు. ఊరంతా తిప్పి తిప్పి కొట్టేరు. చావు భయమేసింది. అందుకని మరి యెనకా ముందూ సూడ్నేదు. ఎదురుగున్న విశ్వనాధం పంతులు గోరి పంటపంచలో దూరేను. పొయ్యిమీద మరుగుతున్న నీళ్ల తపేలా యెత్తి, నా యెనకబడినోళ్ల మీదకి ఇసిర్నాను. పొయ్యిలోని కొరకంచు తీసి రంద్రా అన్నాను. ఎవుడూ రానేదు. పారిపోనారు."

చేతిలో కొరివి దివిటీలా వెలుగుతోంది. వాని మొహంలోనూ వెలుగే ! శరీరమ్మీద గ్రామస్థులు కొట్టిన దెబ్బలు, శతాబ్దాలుగా తగిలిన గాయాల్లా కన్పిస్తున్నాయి కొరివి వెలుగులో!

"ఎందుకిలగ? ఊరు నామీద ఉరమని పిడుగైందేటి? ఎందుకు? ఎనకా ముందూ లేనోడ్ని. ఊరిమీది బతుకు! పగలు పనీపాటకి పోతే దినం తీరిపోయేది. రాత్రుళ్లు ఊరిలోకెళ్తే ఇంటికో ముద్ద గిన్నెలోబడి కడుపు నిండిపోయేది. ఏ ఇల్లూ ఏనాడూ పొమ్మనలేదు. ఎప్పుడేన యెల్లకపోతే, 'యేవిరా నిన్న రాలేద'నడిగేవోళ్లు!

ఆళ్ల చంటిపిల్లలు అలిగితే పెంటి గోడొస్తండు. ఈ ముద్ద ఆడికేసేస్తామని బెదిరించి తినిపించేవోరు. ఒరే పెంటిగా! 'అమ్మా' అనరా! ఇదిగో ఈ ముద్ద నీకేసేస్తామనీవోరు.

ఏ పిల్లకో, పిల్లాడికో కసింత ఒళ్లు కాలినా, మంచంబట్టినా ఇంటిలోని మనుసులకంటే ముందు, నీనే దిష్టిదీసీవోడ్ని! కడుపు సెడితే పరుగెత్తికెళ్లి వేపమూడికలో మురిపిండి ఆకో, తివ్వతీగనో తెచ్చి మందిచ్చీవోణ్ణి! ఎవురి నులకమంచం తెగిపోయినా నీనే నేతనేసీవోణ్ణి. ఊరి, ఊరందరి బంధు, బలగాలకి ఏ కబురో, కాకరకాయో అందించాలంటే నీనే కాలినడక టపామేన్ని! ఊరికి పరాయోణ్ణిగానయ్యా! మరిపుడిదేటి? ఎందుకిలాగ కొట్నారు?" వెక్కిళ్ల గొంతుతో పెంటడు...!

బి.ఎస్. చలం జవాబాలోచించలేదు. పెంటడ్ని ఎక్కడకు తీసికెళ్లటం? కాలనీకి వెళ్లిపోనిస్తే జరిగింది తెలిస్తే కాలనీ జనాలు పెంటడి మీదనయినా పడతారు! లేదా ఊరిమీదకైనా ఉరుకుతారు! ఇప్పటికే కాలనీ దట్టించిన మందుపాతరలా వుంది ఏ క్షణాన్నయినా, ఏ కారణాన్నైనా పేలనున్నది.

"పెంటా! కొరకంచు ఆర్పెయ్యి! తువ్వాలుగుడ్డ ఒంటినిండా కప్పుకో, ఈ రాత్రికి మా ఇంట్లో తిండి తిని నిద్రపోదువు పదా" చెప్పేడు చలం.

పెంటడింకేమీ ఆలోచించలేదు. కొరివి ఆర్పేసి మౌనంగా చలంని అనుసరించేడు.

ఊరికీ, దళిత కాలనీకీ సరిహద్దురేఖలో ప్రాథమిక పాఠశాల. దాని పక్క అంగన్‌వాడీ కేంద్రం బిల్డింగు! ఏభయ్యేళ్ల కిందటవి లేవు. అక్కడ పరిసినాయుడుగారి పండ్లతోటలుండేవి! వాటికెదురుగా గోపినాయుడి మెట్టభూమి! చలం, ఆ మెట్టభూమి కొనుక్కొని ఇల్లు గట్టుకున్నాడు. ఇంటికెదురుగా పూరిపాకవేసి ఆసుపత్రి పెట్టేడు. గత అయిదారేళ్లదాకా ఊరికీ, పరిసర గ్రామాలకీ పేరున్న వైద్యుడు బి.ఎస్.చలం. ఇటీవల, దగ్గరి పట్నంలో నర్సింగ్ హోంలు పెరగటంతోనూ, ఎంబీబియస్ డాక్టర్లు మండల కేంద్రాలకు మకాంలు విస్తరించటంతోనూ చలం ఆస్పత్రికి రోగుల రాక తగ్గింది. జబ్బు ముదిరిపోయి, డబ్బుల్లేనోళ్లే వస్తుంటారిప్పుడు.

పెంటడు, తిండి తిన్నాక ఆస్పత్రిపాకలో నిద్రపొమ్మని చెప్పి, చలం ఆలోచనల్తో మంచమ్మీద వాలేడు. క్రౌంచపక్షినయితే ఆదుకున్నాడుగానీ, పక్షుల గూళ్లను కాపాడలేక పోయాడు. చీకటి ముదిరినవేళ, ఊరూ, వాడా చెట్టూ చేమా ఆదమరిచి నిద్రించేవేళ– కాలనీ అంటుకుంది అగ్నికి. మంటలు, కేకలు, హాహాకారాలు, ఆర్తనాదాలు!

పెంటడి కొరివికి ప్రతీకారంగా కాలనీ దగ్ధం.

"చరిత్రంటే గాయమేగా. ఊరవతల వేసిన కేకలేగా!" కళ్లు మూసుకు ఆలోచిస్తోన్న చలం ఆలోచనలు తెగి, రాసిన ఆ వాక్యం దగ్గరే ఆగిపోయేయి. పదేపదే ఆ వాక్యమే

చదవసాగాడు. గుండె గాయపడితేగానీ, మనసు మండితేగానీ వాక్యాలు రావంటారింది కేనేమో? చలంకి గాయపడ్డ గుండె కొట్టాడుతోంది గానీ వాక్యం కొనసాగటంలేదు.

వారం రోజులుగా దినపత్రికల్లో వస్తోన్న వివిధ కథనాల గురించీ, దళిత కాలనీకీ, గ్రామానికీ మధ్య రగిలిన చిచ్చు గురించి జీవరత్నం ఫోన్‌చేసి అడిగేడు. ఫోన్‌లో చలం చెప్పింది ఈ ఒక్క వాక్యమే.

వివరంగా రిపోర్టురాసి, ఫోటోల్తో సహా పంపిస్తే 'దళితవాయిస్' పత్రికలో ప్రచురిస్తానంటాడు. మరెక్కడో, దళితలు క్రైస్తవులుగా మారేరని హిందూ మిలిటెంట్లు దాడిచేసి చంపేరట. అటు వెళ్తున్నాడట. అటు నుండొచ్చేసరికి జీవరత్నానికి రిపోర్టు కావాలట.

జీవరత్నం కోరుకున్నది కాలనీపై జరిగిన దౌర్జన్యకాండకు సంబంధించిన సమాచారమూ, సాక్ష్యమేనా! అంతేనా? కాలనీకీ, గ్రామానికీ మధ్య లేచిన మంటల్ని మాత్రమే ఫోటో తియ్యాలా?

ఎందుకో! తనకీ ఫోటోగ్రాఫిక్ రిపోర్టింగ్ సాధ్యం గావటంలేదు. వాక్యం రాయబోతే ఎప్పటివో దృశ్యాలు, చరిత్ర కదుల్తోంది. కలం ముందు! కాగితం, కలం అలా పడేసి బెడ్‌మీద అలసటగా వాలిపోయి కళ్లు మూశాడు......

చుట్టూ తోటలమధ్య ఊరు, ఊరవతల మాలపేట, పేట పక్కన శ్మశానం, శ్మశానంలో కాల్తోన్న శవం. సగం కాలిన శవం చుట్టూ తిరుగుతూ, చిన్నారి చేతుల్ని జోడించి మొక్కుతున్నాడో బాలుడు. చితిచుట్టూ తిరిగి, ఇంత నేలబుగ్గిదీసి, కాష్ఠం మీద వేశాడో వృద్ధుడు. బిడ్డనీ, తండ్రినీ చుట్టుకు కన్నీటి కడవయ్యిందో స్త్రీ! ముగ్గురూ శ్మశానం దాటి, ఊరుదాటి, తోటలుదాటి, పడమటగా దోవదీశారు. దగ్ధభూమిలో, తన దేహంలోని అంగమేదో వుండిపోయినట్లుగా నీటి పొరల్లోంచి కళ్లను తెరచీ తెరచీ వెనుకకు చూసుకుంటూ నడుస్తోందా స్త్రీ! గ్రహణకు వచ్చీరాని దుఃఖపుచొక్కాను యెగవేసుకుంటూ తడబడుతూ అడుగువేస్తున్నాడా బాలుడు! నిరాయుధ క్షత్రగాత్రుడు మిగిలిన సంతానాన్ని రక్షించుకునేందుకు రణక్షేత్రం నుండి ప్రవాసానికి పయనమయినట్లుగా నడుస్తున్నాడా వృద్ధుడు.

నడిచీ నడిచీ అలసిపోయి యేడుస్తూ "తాతా... తాతా మరి నడవలేను" దీనంగా చెప్పేడు బాలుడు.

"నాయనా చలమో! కులం తక్కువోడు కూడేగాదు అశుద్ధమూ తినాల. అరిగించుకోవాల! నీ తండ్రి అరిగించుకోలేదు. ఇలాటి బతుకు నువ్వు బతకొద్దు. ఈ నేలలో వుండొద్దు. పదా, పరాయి నేలకి పోదాం"

దివాణం భూములు, ఈనాం, కౌలుహక్కులకింద ఊరిలో చిన్నా పెద్దా రైతులే దివాణం భూములు దున్నేవాళ్లు. చాకలి, మంగలి, మేదరి, కంసాలి, మాల, మాదిగలు,

చేతి వృత్తులూ, కూలీనాలీ చేసి బతికేవాళ్లు. మాల, మాదిగలు ఊరికి కొద్దిదూరంలోని అడవి పంటల సేకరణ మీదా, ఊరి చుట్టూగల తోటల పోషణమీదే జీవించేవాళ్లు. ఊరిచుట్టూ తోటలు పరిసినాయుడు గారివి. ఎండీ, పండీపోయి రాలిన ఆకులు యేరుకోవాలి తప్పా పండ్లను ఎవరూ ముట్టుకోరాదు! అది అలిఖిత శాసనం! మల్లేశుముట్టేడు. మరి కొన్ని పండ్లను, చిన్నారి చలం కోసం తుండు గుడ్డలో మూటగట్టేడు.

అంతే! పరిసినాయుడుగారి పువ్వుల కొరడా లేచింది. మల్లేశు వీపుమీద ముగ్గులేసింది. చిన్నారి చలాన్ని ఎత్తుకొని భార్య–మల్లేశుని చుట్టుకు ఏడ్చింది. పరిసినాయుడు పాదాలు పట్టుకుంది. నాయుడి పాదం విసురుకు చిన్నారి చలం... ఒంటేలూ, విరేచనమూ వెళ్లేడు. అదిగో దానినే మల్లేశు చేత కొట్టీకొట్టీ తినిపించేడు.

వాంతుల్తో, వికారంతో వికృతంగా పేగులు విరుచుకు, మూడో రోజుకి మరణించేడు మల్లేశు......

నిద్రా, అలసటా ఒదిలేసింది బి.ఎస్.చలంకి! కళ్లు తెరవకుండానే మళ్లీ అప్పటిదాకా కలగా కదలిన చరిత్రనే మననం చేసుకోసాగేడు. తండ్రి రూపాన్ని గుర్తుతెచ్చుకోటానికి ప్రయత్నించేడు. కాళ్లూ రెక్కలూ విరిగి, నూతిలో గిలగిల కొట్టుకునే పక్షియేదో గుర్తొస్తోంది తప్ప తండ్రి రూపం గుర్తురావటంలేదు.

బర్మా నేలమీద బాల్యం అజ్ఞాతవాసమయ్యింది. చెమట చిందించి బతకటం! లోకం పోకడ యెరిగే వయసుకి ఎదిగేసరికి తాతయ్య చనిపోవటం, పదిహేనేళ్ల కిందట పోగొట్టుకున్న దేహంలోని సగభాగం కోసం పుట్టిన ఊరివైపు పయనం! మళ్లీ జన్మభూమిలో అడుగుపెట్టడం, చలానికి ఊరు తీపిగుర్తు గాదు, పీడకల!

అయితే బాల్యంనాటి ఊరు మారింది. పెరిగింది. ఊరి చుట్టూగల తోటలు కొన్ని తెగిపోయి ఇళ్లయినాయి. పరిసినాయుడు గారు లేరు. దివాణం విధానం పోయింది. ఊరు మేజర్ పంచాయితీ గ్రామమైంది. పరిసినాయుడుగారి కొడుకు రాజేంద్రనాయుడు సర్పంచ్. ఊరికి కరెంటొచ్చింది. పొలాలకు మోటార్ పంపులొచ్చేయి. కొందరు రైతుల ఇళ్లు పెంకులు వేసుకున్నాయి. దళితవాడలో పాఠశాల వచ్చింది. గుడిసెలు కాలనీ ట్విన్నులయినాయి. గర్భదారిద్ర్యం తగ్గింది. అయినా దళితులు భూమిగల రైతులు గాలేదు. ఇంకా పండ్లతోటల కాపలా, పందుల పెంపకం, అడవి పంటల ఫలసేకరణా జీవనాధారమే వారికి,

బహుశా, ఆహారసేకరణ దశనుంచి ఉత్పత్తిదశకు ముందుగా ఎదిగినవాళ్లు, వెనకబడ్డవార్ని దళితుల్ని చేశారేమో? అలా గతంలోంచి ఒక నిర్ధారణకొచ్చేక బి.ఎస్.చలం మూసిన కళ్లు తెరిచి వర్తమానంలోకి వచ్చేడు. మళ్లీ రాసిపడేసిన వాక్యం చదవసాగాడు. అంతలో పెంటడి ప్రశ్న గుర్తొచ్చింది.

"ఊరికి పరాయోణ్ణి గానయ్యా! మరెందుకిలాగయ్యింది?"

అప్పుడే... "ఇది మూడో దెబ్బ. అన్ని దెబ్బలూ ఆళ్లవే. ఇది రివాజయిపోయింది. ఊరొచ్చి కాలనీ మీద బడతంది. చలం బాబో! ఇక ఊరో, కాలనీయో యేదో ఒకటే మిగల్తాది. రెండుండవు...ఆఁ" మొలలో కత్తి దోపుకుని, కళ్లనిండా ఆగ్రహం నింపుకుని తిరిగే అసిరయ్య గుర్తొచ్చేడు.

రెండుండవా? రెండుగా వుండగూడదా?

రెండుండడానికి ఒప్పుకోని తొలి ఘర్షణ గుర్తొచ్చింది.....

"రెండెందుకు? పగలెయ్యండి, రెండో దాన్ని... పగలెయ్యండి" అరుపులు, కేకలు, ఫటేల్, ఫటేల్మని పగిలిన గ్లాసుల చప్పుడు!

గ్రామానికి ఆనించి, ఉత్తర దక్షిణాలుగా జాతీయ రహదారి. రహదారికిరువైపులా నాలుగు టీ దుకాణాలూ, మూడు కిల్లీబడ్డీలూ! వాటికి కాస్త దూరంలో విఠల్‌రావు రైస్‌మిల్లూ, శంకర్రాజు కోళ్లఫారమూ! పరిసర గ్రామాలకది రహదారి కూడలి. ఎప్పుడూ సందడి సందడిగా వుంటుంది.

టీ దుకాణాల్లో దళితుల గ్లాసు, పెడక వాసాలకి తగిలించి వుంటుంది. దళితుడే దాన్ని తీసుకొని కడుక్కోవాలి. దుకాణాదారుడు అందులో టీ పోస్తాడు. టీ తాగేక గ్లాసు కడిగేసి మళ్లీ వాసానికి దోపాలి.

"కుమ్మరోడితోటి సాల్లేక కుండలు పగలేసినట్లగ ఇదేటర్రా ఈ పని? మేమేటి కొత్తగ పెట్నామా రెండు గళాసులు? మునుపులేవా? మునుపటి మీవోళ్లేటన్లేదు. మరిప్పుడు మీరేటిలగ?

అదిగాక, మా సేతిలేటున్నాది? కడుపు జరక్క, కప్పులు కడుగుతున్నాం. మీ గళాసులూ కడిగేయమంటే కడిగేస్తాం. గాని ఆళొప్పుకోరు. వేర్వేరుగా గళాసుల్లేపోతే ఆళ్లు రారు. ఎనక్కెల్తే నుయ్యి, ముందుకెళ్తే గొయ్యి" టీ దుకాణాదార్ల తరపున గోవిందరాజు గోసపెట్టేడు.

"గళాసులంతే, పగలేస్సేరు. నీలాటిరేవులు రెండు లేవా? మరి, నూతులు వేరుగలేవా? మీరుండే గుడిసెలు ఊరవతల్లేవా? మరాటి సంగతేటి? అవన్నీ మార్చగల్రా? ఎందుకర్రా పనికిరాని పంతాలు?" మరెవరో హితబోధ చెయ్యబోయేరు.

"ఆటి సంగతీ చూస్తాం. ముందు మీ గ్లాసుల సంగతి తేలుస్తాం. ఏం, ఊర్లోవాళ్లే గవినేర్లా? ఆళ్లకాడ మీరు జడిసిపోవాలా? మేముగాని కేసులు బెడితే ముందు మీరు జెయిళ్ల కూచుంటారు. రెండు గ్లాసులకి చట్టం ఒప్పుకోదు తెల్సా?" దళితుల తరపున హెచ్చరించేడు ఎర్నెస్టు!

క్షతగాత్రమయి, రణక్షేత్రం నుండి పరారయిన జాతి మళ్లీ రణం చేస్తోంది. తాతయ్యకు లేని కొన్ని ఆయుధాలు నేటి తరానికున్నవన్పించింది చలానికి.

అలా అన్పించేక, ఉత్సాహం కలిగింది. కలం అందుకొని వ్యాసాన్ని కొనసాగిస్తుండగా, గార గోపినాయుడు దినపత్రిక తెచ్చేడు. కలాన్నీ, కాగితాన్నీ పక్కనపెడ్తూ పత్రికందుకుంటూ "ఏమిటి భోగట్టాలు" అనడిగేడు చలం.

"అదేదో దేశమ్మీద అమెరికావాడి దాడి. ప్రధానికి, అదేదో పార్టీ ఊతకర్ర లాగివేత. రాష్ట్రాన్ని – కొరియాజేసేదాకా నిద్రపోనని ముఖ్యమంత్రి శపథం! మూడు రైళ్లు – పట్టాలు విడిచి భూమ్మీదా, ఆరు బస్సులు, భూమి విడిచి నదులలోకి ప్రయాణించగా అరవయ్యారు మంది పరలోకయాత్ర! వార్తల్లోని ముఖ్యాంశాలు విన్నారు..." చెప్పేడు నవ్వుతూ గోపినాయుడు.

చలానికి, గోపినాయుడంటే అందుకే ఇష్టం. ఏ సందర్భంలోనైనా, యే విషయాన్నైనా చమత్కారంగా చెప్తాడు.

గోపినాయుడు కొన్నాళ్లు చదువుకున్నాడు. పరీక్షల్లో అపజయాలెదురయ్యిందాక. కొన్నాళ్లు, చిన్నాచితకా నౌకరీలు చేశాడు – జీతంకంటే యాతన ఎక్కువయ్యిందాక. మరికొన్నాళ్లు వ్యవసాయంజేశాడు – పంటలకంటే అధికమయిన మదుపులకింద భూమి తనఖాకీ, అమ్మకానికీ వెళ్లేదాక. తర్వాత కొన్నాళ్లు విప్లవ రాజకీయాల్లో తిరిగేడు – విప్లవపార్టీ గ్రూపు గ్రూపులుగా చీలిందాక.

ఇక ఆ తర్వాత ఏమీ చెయ్యటం మానేశాడు. బ్యాంకులోన్ ద్వారా కొన్న గేదెల పాలు అమ్మకంజేసీ, కూలీనాలీజేసీ, భార్యాబిడ్డలేమో ఇంటిని గడుపుకొస్తుంటే ఈ వ్యవస్థలో తనలాంటి వాళ్లు ఇమడలేరని చెప్పుకు తిరిగేవాడు.

బర్మానుండి వచ్చిన తొలినాళ్లలో, చలం కూడా ఇలాగే అనుకున్నాడు. గ్రామంలో తనకు బాల్యం విషపుగుళిక. బాల్యమిత్రులూలేరు. అక్కరకురాని మైత్రి అంతో ఇంతో బర్మాలో కొందరితో వుండేది. ఊరిలో చాలా మార్పులొచ్చేయి. అయినా, జన్మభూమి పరాయినేల అన్పించింది. వచ్చిన కొద్ది నెలలకే తల్లి శ్మశానం చేరుకుంది. శ్మశానాన్ని చూస్తే చలానికి దేహంలో రక్తానికి బదులు కన్నీరు ప్రవహించేది. ఊరూ, కాలనీ తనను దగ్గరకు పిలిచి ఆదరంగా పలుకరించే ఆశ్రమాల్లాగాక, ఆగ్రహంగా చూసే పరదేశీ గుడారాల్లా కన్పించేవి. ఈ ఊరిలో తను ఇమడలేననుకున్నాడు. పట్నంచేరేడు. ఓ వైద్యుని దగ్గర కంపౌండర్‌గా చేరాడు. ఆ వైద్యుని వెంట పట్నంలో, పరిసర గ్రామాలలో రోగుల ఇళ్లకు వెళ్లేవాడు. అదిగో అలా వైద్యుని వెంట మళ్లీ ఊరిలోకి అప్పుడప్పుడూ రావటం తటస్థించింది. అప్పుడొకసారి గోపినాయుడు పరిచయం..........

“ఈ గాయాలెలా తగిలేయి?”

“ఎలా తగిలుండొచ్చు?”

“ఏక్సిడెంటు జరిగిందా?”

“ఔను, నా జీవితమెల్లి పోలీసు లాకప్పుని గుద్దింది” అన్నాడు నవ్వుతూ గోపినాయుడు. అర్థంగాక చలం, గోపినాయుడి గాయాలకి చికిత్స చేస్తూ మళ్లీ ప్రశ్నించేలోగానే –

“గోనెసంచీ కప్పేసి, రబ్బరు బెత్తాలతో కొడితే దెబ్బ కన్పించదు. గాయం మాత్రం దేహాన్ని హింసిస్తాది”

“ఎందుకలా కొట్టేరు పోలీసులు?”

“ఇలాంటి ప్రశ్నలు వేసినందుకే” మళ్లీ నవ్వుతూ జవాబిచ్చేడు గోపినాయుడు.

“నీ తండ్రి, ఈ ఊరి భూస్వామ్య సర్పం కాటువేస్తే చనిపోయేడు. నీ తాత పరదేశం పోయేడు. నీ తల్లితో జన్మభూమికొచ్చినవాడివి. ఎందుకిక్కడ వుండలేక వెళ్లిపోయేవు?” అడిగేడు గోపినాయుడు.

బి.ఎస్. చలం ఏమీ జవాబు చెప్పలేదు. తట్టలేదసలు. సూటిగా చెప్పలేదు, ఔనెందుకు వెళ్లిపోయేను? ప్రశ్నించుకున్నాడు. జవాబు రాలేదు. మెడికల్ కిట్ సర్దుకుంటూ ఆలోచించసాగేడు. ఈలోగా పక్కవీధిలో, రోగికి సెలైన్ ఎక్కించి వచ్చిన వైద్యుని పిలుపుతో చలం అక్కణ్ణించి కదిలేడు.

“వస్తాను” గోపినాయుడికి చెప్పేడు.

“ఈ ఊరు ఒదిలి బతకటం కాదు, ఊరిలోనే బతకాల” గోపినాయుడు గాయాలు తడుముకుంటూ చెప్పేడు.

ఇప్పటికీ గుర్తున్న ప్రశ్నా... జవాబూ!

చిత్రంగా, గోపినాయుడితో స్నేహం కలసింది అప్పట్నించీ!

ఊరి ముందర రైస్ మిల్లుండేది. దాన్ని విఠల్‌రావు ఇప్పుడు సిన్మాహాల్ చేశాడు. విఠల్‌రావు తండ్రి రైస్‌మిల్లుకి డ్రైవరుగా ఒక పీర్‌సాయిబుని పెట్టుకున్నాడు. పీర్‌సాయిబుకి ఒక గుర్రబ్బగ్గీ, గుర్రంలాంటి భార్యా వుండేది. గుర్రబ్బగ్గీనీ, గుర్రంలాంటి పీరు భార్యనీ విఠల్‌రావు తండ్రి వశం చేసుకున్నాడు. అందుకేమో విఠల్‌రావు తండ్రిని అందరూ సాయిబు నాయుడనేవారు. ఓరోజు గుర్రబ్బండీ ఏక్సిడెంటులో పీర్‌సాయిబూ, సాయిబునాయుడూ ఇద్దరూ చనిపోయేరు. పీరు భార్యా, కూతురూ మిగిలేరు. విఠల్‌రావు మిల్లుని సిన్మాహాలుజేశాక కేంటీన్ చూసుకు బతకసాగేరు. పీరు కూతురు పెళ్లీడుకొచ్చింది. పీర్ భార్యకు వైద్యంకోసం వచ్చినప్పుడు చూసేడు చలం ఆమెని! తర్వాత్తర్వాత తరచూ కేంటీన్ వైపు కాళ్లులాగేసేవి.

"ఆయమ్మ ఖురాన్ అంటే నువ్వు సైతాన్ అంటావు. మీ ఇద్దరికీ కుదుర్తదా? అసలింతకీ నీ ఉద్దేశమేమిటి?" స్నేహమిచ్చిన చనువుతో ఆరాదీసేడు గోపినాయుడు.

అప్పటికే చలం వైద్యుని సలహాసహకారాల్తో ఆర్.ఎం.పీ. పాసయ్యేడు. వైద్యంలో కొద్దోగొప్పో నైపుణ్యం సాధించేడు. గోపినాయుడు తొలి ప్రశ్న, జవాబుని తర్కించుకుని ఊరువైపు మనసు మళ్లించుకోసాగేడు. దానికి తోడుగా ఈ ప్రేమ! గ్రామానికి వచ్చేయటానికీ, పెళ్లి జేసుకోవటానికీ, ప్రజావైద్యశాల నిర్వహించుకు జీవించటానికీ నిర్ణయించుకున్నానని చెప్పేడు చలం!

అంతా విన్నాక గోపినాయుడు –

"నిన్ను మీ కాలనీ కలుపుకోదు. మా ఊరు నిన్ను రానివ్వదు. ఇదిగో ఇదిగిక్కడ మధ్యస్తంగా వుండిపో" గ్రామానికీ, కాలనీకీ సరిహద్దు రేఖలా వున్న మెరకగుట్ట చూపి చెప్పాడు గోపినాయుడు.

ఆ మెరకగుట్ట గోపినాయుడుకి మిగిలిన భూమి. అందులో ప్రజావైద్యశాల పెట్టేడు చలం. పదిహేనేళ్లయ్యింది. గ్రామంలోకి ఇప్పుడు హైస్కూలూ, ఆసుపత్రీ, బ్యాంకూ వచ్చేయి. చలం వైద్యశాలకి బిజీ తగ్గింది. గోపినాయుడితో కాలక్షేపమే ఎక్కువయ్యిందిపుడు........

"రెయ్యమ్మ నిరాహారదీక్షా శిబిరం ఎత్తివేత! రెయ్యమ్మ ఆసుపత్రికి తరలింపు. ఆసుపత్రిలో నిరాహారదీక్ష కొనసాగింపు" చలం ఆశ్చర్యంగా చదివేడు పత్రికలో వార్తను.

జిల్లా ఎడిషన్ సెంటర్ పేజీలో బాక్స్ ఐటమ్! ఆసుపత్రి బెడ్‌మీద ప్రక్కకు ఒరిగిన నెలవంకలా రెయ్యమ్మ!

"అన్నలే వుంటే రెయ్యమ్మ గాంధీమార్గం పట్టేదిగాదు. ఏమార్గంలోనూ రెయ్యమ్మకి భూమి వచ్చేట్టులేదు" అన్నాడు గోపినాయుడు.

ఆశ్చర్యంగా చూడసాగేడు చలం.

"అదంతా పెద్దకథ. వేగంగా తేలదు. నువ్వు బేగ్‌పట్టుకు వైద్యానికి ఎళ్లాల! నేనూ పశువులు మేతకి తోలాల...!" మరోసారి చెప్పుకుందామన్న ధోరణిలో గోపినాయుడు.

"ఫర్లేదు! ఉపమానాలూ, వర్ణనలూ మానేసి అసలు విషయాన్ని సూటిగా చెప్పెయ్యి" తొందర చేశాడు చలం.

"వ్యాకరణంలేని భాషా, సూత్రాలులేని గణితం వుండవుగదా! ఉపమానాలూ, వర్ణనలూలేని కథలు – గుడిలేని విగ్రహాలు" సీరియస్‌గా మొహం పెట్టాడు గోపినాయుడు.

"నీకు చాలా విషయాలు తెలుసయ్యో!"

"జ్ఞానులు ఔనని వెంటనే ఒప్పుకోరు" పొగడ్త కలిగించిన అభిజాత్యం ప్రదర్శించేడు గోపినాయుడు.

"అదీ సంగతి. జ్ఞాని ముసుగులో నువ్వు శ్రమజెయ్యకుండా, చాన్నాళ్లు కబుర్లు చెప్పుకు బతికేశావన్నమాట. ఉద్యోగం, వ్యవసాయం, వ్యాపారం జ్ఞానులు చెయ్యరాని పనులనీ, చేసినా చేతులు కాలిపోతాయనీ చెప్పుకు బతికేవన్న మాట" చలం రిటార్డ్ ఇవ్వసాగేడు.

"ఛాఛా... మా ఇంటిలో జ్ఞాని కబుర్లు చెల్లవు. అదీగాక మరో సంగతి, జ్ఞానిమారడు. తన జ్ఞానమే నిత్యమంటాడు, సత్యమంటాడు. కానీ నేను మారేనుగదా" గోపినాయుడు మాటలకు దొరకడు.

చలం గ్రామానికొచ్చిన కొన్నాళ్లకు గోపినాయుడి చేత దినపత్రికల ఏజన్సీకి దరఖాస్తు పెట్టించి, ఏజన్సీ సంపాదించి దినపత్రికని పంపిణీ చేయించేవాడు. అలాగే గేదెల పాలు అమ్మకానికీ వెళ్ళేట్టు చేసేడు.

"అయ్యా నీతో కష్టం, అసలు విషయం చెపుదూ" బతిమాలుకున్నాడు చలం.

"ఒకానొక ఆర్డీవోగారు పట్టా ఇచ్చేరు. పట్టా వచ్చిందిగదా అని భూమిమీదకి వెళ్లబోతే శివున్నాయుడు శివమెత్తేడు. ఊర్నించే తగిలేస్తానన్నాడు. పట్టా పెట్టెలో పెట్టేసి శివున్నాయుడికి సలాం గొట్టేరు. నాలుగయిదేళ్లు గడిచేక ఒకానొక విప్లవపార్టీవాళ్లు రెయ్యమ్మకి ధైర్యం చెప్పి, భూమిలో ఎర్రజెండా యెగరేసి భూమి దున్నుకోమన్నారు. రెండు, మూడేళ్లవలేదేమో! ఆర్డీవో బదిలీ మీద వెళ్లిపోయేరు. ఆ విప్లవపార్టీ ఎన్‌కౌంటర్‌లతోనూ, నిర్బంధాలతోనూ మొలచిన శక్తులు రాలిపోతుంటే మళ్లీ కథ మొదటికొచ్చింది. భూమి భాగోతం నడుస్తోంది" టూకీగా చెప్పేడు గోపినాయుడు.

ఏమీ అర్థం కాలేదు చలానికి. అయోమయంగా చూడసాగేడు.

గ్రామంలో మార్పులొచ్చినట్లే ప్రభుత్వం గూడా కొన్ని మార్పులు చేపట్టింది. అప్పటికే గ్రామానికి ఎగువనున్న ఏజన్సీలో గిరిజనోద్యమం, హింస దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం – హరిజన, గిరిజన పేదలకు బంజరు భూముల పట్టాల పంపిణి చేపట్టింది. గ్రామంలోని చాలా భూములు, దివాణంకి చెందినవి గావటంతో అవి దున్నే రైతులకి సాగుహక్కు అయినవి. ఆ సందర్భంగా కమ్యూనిస్టులు గ్రామ రైతులకెంతో సహకరించేరు గానీ అప్పటికీ సాగు హక్కులేని వ్యవసాయ సంబంధంగాని వృత్తుల్లోవున్న దళితులకి ఈ కమ్యూనిస్టులు సహకరించలేదు. దళితులూ కమ్యూనిస్టుల్తో కలువలేదు. అదిగో, ఆ కలువని సెక్షన్‌ని ఆకర్షించటానికి చేపట్టిన యెత్తుగడే పట్టాల పంపిణీ!

"అంటే చాన్నాళ్లుగా నలుగుతున్న సమస్యన్నమాట?" చలం ప్రశ్నించేడు. ఆ ప్రశ్నలో, ఇన్నాళ్లనించీ ఏ ఉద్యమమూ, ఏ సంస్థలూ ఏ వ్యక్తులూ దీన్ని పరిష్కరించలేదన్న యెత్తి పొడుపు ధ్వనించింది.

“నేను ఇప్పుడు రాజకీయాలొదిలేశాను” ఎందుకో, అలా జవాబిచ్చేడు గోపినాయుడు. మళ్లీ అంతలోనే ఏమనుకున్నాడో –

“మాకు ముందుగా ఊర్లో – దివాణంకి వ్యతిరేకంగా, భూస్వామ్య పెత్తందార్లకి వ్యతిరేకంగా కొట్లాట ముఖ్యమైంది. మాల, మాదిగల్ని మేము కలుపుకోలేదు. ఆళ్లూ కలవలేదు” సంజాయిషీలాగ చెప్పసాగేడు.

అప్పటికే అక్కడికొచ్చి, ఆ సంభాషణంతా విన్న ఎర్నెస్ట్ –

“కలిస్తేమటుకేం లాభించింది? మీకూ, మాకూ మధ్యనా అంతరాలే! కులం తక్కువా, యెక్కువా ఇక్కడా యెదురైంది. వర్గ సమాజం పోతే చాల్ను మీకు, మాకు కుల సమాజమూ పోవాల” అని జవాబు చెప్పేడు.

గోపినాయుడు మౌనం వహించేడు. ఎర్నెస్టుతోపాటూ నలుగురు యువకులొచ్చేరు. వాళ్ల చేతిలో యేవో పత్రాలున్నాయి. ఒక యువకుడు ఓ పత్రం చలానికిస్తూ –

‘ఇది నిశానీపత్రం. నిరసన పత్రం. దీని మీద బొటనవేలి ముద్ర వెయ్యండి” అని చెప్పేడు.

చలం విజ్ఞాపన పత్రం చదవసాగేడు. కలెక్టర్ బదిలీకి నిరసన!

జన్మభూమి కార్యక్రమంలో పంపిణీ జరిగిన మొక్కల లెఖ్ఖల్లో కుంభకోణం జరిగిందని అసెంబ్లీలో ఎమ్మెల్యేల ప్రశ్నలూ, ప్రకటనలూ! ఈలోగా జిల్లా కలెక్టర్ కుంభకోణం జరుగలేదని తన పరిశీలనలో తేలిందని పత్రికా సమావేశాల్లో ప్రకటించి అసెంబ్లీని అవమానించేరట! అందుకని బదిలీ అట.

“దళితుడనేసరికి అభ్యాజిషన్‌లేదు. అందరూ ఏకపక్షమే. జిల్లాలోని ఎమ్మెల్యేలందరికీ కలెక్టర్ బదిలీగావాలి. కలెక్టర్ వల్లనే దళితుల ఆగడాలు అధికమయ్యేయట! ఇప్పుడు కలెక్టర్ బదిలీ జరిగితేగానీ నియోజకవర్గాల్లో అడుగుపెట్టం అన్నారు. అలాగే అన్న విధంగానే బదిలీ చెయ్యించేరు. దళితుడంటే అంత చులకన!” ఆక్రోశంగా పలికేడు ఎర్నెస్ట్.

“దళితుడనిగాదు. పేదోడనేసరికి ఆళ్లంతా ఏకమైపోతారు. దాడికి దిగుతారు. పేదోడంటేనే చులకన” సవరించబోయేడు గోపినాయుడు.

“అలగనకు. మిగిలినకులాల పేదలకంటే దళితులపరిస్థితి ఘోరం. పేదలందరొకటి గాదు. మొన్న అమ్మవారి సంబరాల్లో యేం జరిగింది? ఊరంతా ఒక్కటయ్యింది. మా వాడమీద దాడిజేసింది. మీరు పేదలయినా మాకంటే పెద్ద కులపోళ్లు. అదేగదా మా వాడకి నిప్పెట్టింది” మొన్నటి గాయాన్ని గుర్తుజేసుకు వాదనకి దిగేడు ఎర్నెస్టు.

గోపినాయుడు జవాబివ్వలేకపోయాడు.

ఒక మానవీయ సంభాషణ వుండాల్సిన చోట, అమానవీయ బూతుపదమే అగ్రవర్ణం నోటిలోంచి రాల్తోంది. మాటా, చేతా దళితుడనేసరికి అనాగరికంగానే మిగుల్తోంది. సహించిన తరం మారిపోయింది. ఘర్షించే తరమిది! చలానికిప్పుడు మనసు లోలోపల క్రమరహితంగా కదలిన ఘటనలు ఒక క్రమంలో గుర్తుకు రాసాగేయి. రెండు గ్లాసుల తిరస్కారం, ఘర్షణ తర్వాత అమ్మవారి సంబరాలు! సంబరాలొకవైపు సాగుతూ ముగింపులో జరిగిన సంఘర్షణ... గుర్తుకు రాసాగింది.

'ఉయ్యాలకంబాల మాను' నిలబెట్టి, పసుపుగుడ్డలో అక్షింతలు మూటగట్టి వేళాడేసి, సంబరాలు ఆరంభమయిన రోజు నుంచే మంటల్లో వెచ్చబడుతూ మాదిగడప్పులు మ్రోగుతూనే వున్నాయి. 'జన్నితాత' ఇంటి నుంచి 'ముర్రాటు' కోసం మంగళి మేళంతో, మాదిగ డప్పుల స్వరసమ్మేళనం! 'పోలమ్మ తల్లి' గడపదిగి అడుగులు వేస్తే అసిరోడి 'తుడుం' పూనకమెత్తేది. పారిగాడి డప్పు, ఇరుపు దరువుల్తో పోలమ్మతల్లి తోబుట్టువు నూకాలమ్మతల్లి, వేపకొమ్మల్తో ఊగిపోయేది. ఇద్దరమ్మోర్ల వీరంగం! డప్పులూ, తుడుం, ఈళలూ గ్రామవీధుల్లో సంతోష తరంగాలు!

అమ్మోర్లు కాలనీకి వెళ్లారు. కాలనీ ముఖద్వారం వరకూ కొత్త చీరెలూ, పంచెలూ దోవనిండుగా పరుస్తే వాటిమీదుగా నడుస్తూ కాలనీ ముఖద్వారాన అమ్మోరు ఆగుతుంది. కాలనీ ప్రజలు తమ పసిపిల్లలను అమ్మవారి పాదాల ముందర పడవేస్తే అమ్మవారు పాదాలతో స్పృశించి, దీవించేవారు. చేతులెత్తి మొక్కే పెద్దలను వేపకొమ్మల్తో కొట్టి దీవించేది అమ్మవారు! అంతే. అమ్మవారు వెనుదిరిగేవారు. సంబరం ఊరిలోకి మళ్లిపోయేది. ఊరు ఇంత అన్నపుముద్దనీ, ఆనందాన్నీ కాలనీకి భిక్షగా వేసినట్లుండేది.

తన చిన్ననాట – కాలనీ, ఒక వాడ! అందులో పాలేర్లూ, కూలీలూ, నిరుపేదలూ వుండేవారు. ఇప్పుడది కాలనీ అయ్యింది. ఊరి ఎదుగుదలతోపాటూ కాలనీ ఎదిగింది. పాలేర్లూ, కూలీలే వుండే వాడలో బంట్రోతులూ, వాచ్‌మెన్‌లూ, పోలీసులూ, ఆటోడ్రైవర్లూ ఆత్మగౌరవం చొక్కాలు ధరించిన కాలనీ అయ్యింది. తన తాత్తండ్రుల్లా అర్ధనగ్న దేహపు జనం కారు వీళ్లు, పండగలో చిన్నచిన్న గొడవలు – ఎక్కడో ఓ చోట వీళ్లకీ ఊరికీ మధ్య జరిగేవి.

ఆఖరిరోజు... అనుపు పండగ దినం!

బంధువుల్తో గ్రామం నిండిపోయింది. తొలివేకువ ఝామునుండే కోళ్లూ, గొర్రెపోతులూ సిద్ధం చేసుకుని మొక్కులు తీర్చేందుకు గ్రామస్థులు హడావిడి పడ్తున్నారు. పొద్దుపొడిచింది. మోగాల్సిన డప్పులు మోగటంలేదు. కదలాల్సిన అమ్మవారి ఘటాలు కదలటంలేదు. వీధులన్నింటా ఎండ పరుచుకుంది.

నడివీధిలోని రచ్చబండ మీదకి పెద్దలంతా చేరుకున్నారు.

"గవిరిగాడికి కబురెల్లిందా?" అనడిగేడు రాజేంద్రనాయుడు, సర్పంచ్ విఠల్‌రావుని.

"గంటనుంచీ మనిషిమీద మనిషిని వారధి గట్నాం" వాటర్ కమిటీ మెంబరు జగన్నాధనాయుడు జవాబు చెప్పేడు.

"అమ్మోరిని తేడానికి యెల్లినట్లుగ, ఆళ్లని తేడానికి మేళంతోటి గ్రామపెద్ద వెళ్లాలేటో?"

విసురు విసిరేడు విద్యా కమిటీ మెంబర్ శివున్నాయుడు.... సర్పంచ్‌వైపు చూస్తూ. సర్పంచ్‌కి బోధపడింది. శివున్నాయుడు తన పెద్దరికాన్నే యెత్తిపొడిచేడనీ! కిందటి ఎన్నికల్లో సర్పంచ్ పదవి, దళితులకి రిజర్వయితే శివున్నాయుడు తన పాలేరు ఫకీరుగాడ్ని సర్పంచ్ చెయ్యబోతే విఠల్‌రావు గవిరేశుని సర్పంచ్ చేశాడు. గవిరేశే డప్పుగొట్టే బృందంకి గురువు. ఇప్పుడా బృందమే రాలేదు.

"చాలా పొద్దెక్కింది. చుట్టం, బంధువు లొచ్చేశారు. వంటలకాలస్యమయి పోద్దిగావాల" రాజేంద్రనాయుడు విసుక్కున్నాడు.

"నీ పెత్తనం ఒకలాగెల్తే, ఇంకొకరి పెత్తనం ఇంకొకలాగెల్తాది. డప్పులుండక్కర్లేదేటో అమ్మోర్ని అనపడంకి. అంతేనంటావా?" అని మళ్లీ అడిగేడు శివున్నాయుడు సర్పంచ్‌ని

అలనాటి పరిసినాయుడు ఆఖరి కొడుకు రాజేంద్రనాయుడు! రోజ్‌గార్ ఫండ్స్ పథకం పంచాయితీలకొచ్చిన దాకా సర్పంచ్‌గా యేలేడు రాజేంద్రనాయుడు. ఆ తర్వాత ఎన్నికల్లో దళితుల్ని ఆకర్షించి నెగ్గేడు సాయిబునాయుడి కొడుకు విఠల్‌రావు. ఇద్దరూ ఒకే కులమయినా రెండు అధికార కేంద్రాలుగా నిల్చేరు. ఈ రెంటిలో దేన్నో ఒకదాన్ని అవసరరీత్యా వాడుకొని అవతలి కేంద్రాన్ని దెబ్బగొట్టి తనో అధికారకేంద్రం గావాలని చూస్తున్నాడు శివున్నాయుడు.

శివున్నాయుడు కొత్తగా ఎదుగుతోన్న సెక్షన్‌కి కేంద్రం. బ్యాంకుల జాతీయం, సబ్సిడీ పథకాలూ, అధికార్లతో చెలిమి, కాంట్రాక్టులూ, అడవి దినుసుల వ్యాపారం– నడమంత్రపు సిరి చేరింది శివున్నాయుడుకి.

"అదిగో, గవరయ్య వస్తుండు" దూరంగా చూస్తూ చెప్పేడు సర్పంచ్, అందరూ అటువైపు చూస్తూ నిల్చున్నారు. గవిరేశ వచ్చేడు.

"డప్పులోలేర్రా?" అడిగేడు సర్పంచ్.

"బయలెల్తంద్రు బావూ వచ్చేస్తరు" గవిరేశు.

"తొత్తుకొడుకులికి కొమ్ములు. మొలిశాయి. ఇంకా బయలెల్తన్నారట! పొద్దవుపడ్లేదేట్రా? ముస్తాబవుతంద్రేటి?" శివున్నాయుడి అన్నదమ్ముడొకడు ఫోర్సుగా ముందుకొచ్చి ప్రశ్నించేడు.

"ఉండడానికి కాలనీలు, తిండానికి రేసన్లూ, పిల్సిపిల్సి పదవులూ ఇస్తుంటే కొమ్ములూ మొలుస్తాయి, కోరలూ వస్తాయి" శివున్నాయుడు – చుట్టూ చేరిన జనంతో అన్నాడు! జనం ఔనౌను అనాలని.

"ఏల బాబూ ఆ మాటలు?" గవిరేశు.

"లేపోతేట్రా? ఎన్ని కవుర్లెట్టినాం? ఎందర్ని పంపినాం?" రాజేంద్రనాయుడు కోపగించేడు.

"అమ్మోరయినా ఆళొచ్చిందాక ఆగాల, గవినేర్లుగదా! ఎక్కడుండవలసినోళ్లని అక్కడుంచితే కొమ్ములూ, కోరలూ రాకపోను" నిర్ధారించినట్లన్నాడు శివున్నాయుడు.

గవిరేశుకి ఆ మాటలు, బాధని కలిగించేయి. ఎందుకాలస్యమయ్యిందో కనుక్కోకుండా ఇలా ముద్దాయినిజేసి దూషించడాన్ని సహించలేకపోయేడు.

"శివున్నాయుడు బాబో, ఎవుళూ ఎక్కడున్నోళ్లు అక్కడే, అలాగే వుండిపోలేదు. నువ్వూ లేవు. నేనూలేను. ఎవుళూలేరు. ఉప్పు మూటలు అద్దెకి బండి పూసీవోడివి– ఊరిల కలిగిన చెయ్యివయినావు గాదేటి?

రేసను గింజలకే కొమ్ములూ, కోరలూ వచ్చేత్తాయా? పోని, మా కాలనీలూ, రేసన్లూ మీరుంచుకొని, మీ భూమీపుట్టా మాకొదిలీయండైతే" గవిరేశు జవాబు పూర్తికానేలేదు. శివున్నాయుడి అన్నదమ్ముడు కోపంగా గవిరేశు గుండెలమీద చెయ్యేసి తోసేసి....

"ఏటి? వొల్లకున్నామని వూసులాడతన్నావేట్రా, మాల్నా కొడుకా? కొమ్ములూ, కోరలూ పీకీడిమేగాదు, నిలువులోతు గొయ్యిదీసి పాతిపెట్టెత్తాం. అదిగా ఆలోసన్తోనేటి రెయ్యమ్మని భూమి దున్నమంతండ్రట? ఒరే పుచ్చులెగిరిపోతాయొరే...ఆ!" కేకలేయసాగాడు.

సర్పంచ్ గభాల్న రచ్చబండమీంచి లేచేడు. అప్పటికే శివున్నాయుడు ముందుకొచ్చి గవిరేశు మెడలోని తువ్వాలుని చుట్టుచుట్టి ఊపి ముందుకు లాగి–

"నిలబడిన పాటుగ నువ్వెల్లి ఆ తొత్తుకొడుకుల్ని తీసుకొని రావాల. ఆలిసిమయ్యిందా మీ డప్పులుండవూ, మీరుండరు....ఆ" అని తీవ్రస్వరంతో హెచ్చరించి కాలనీ దోవవైపు విసురుగా తోసేడు.

గవిరేశు ఒంటినిండా అవమానాన్ని మోసుకుని కాలనీ చేరాడు.

అక్కడిదాకా జ్ఞప్తి జేసుకున్న చలం మనసు వికలమైంది. మరి తర్వాత ఘటనల స్మరణ జెయ్యలేకపోయేడు.

"నువ్వెన్ని చెప్పు బాబూ, కులంపోతేగానీ ఈ దేశంలో పేదలంతా ఏకంకారు. అది మీకు బోధపడదు. మీకే బోధపడితే మీరు ఊరివైపుండరు" ఎర్నెస్టు వాదనకు దిగేడు గోపినాయుడితో.

"నేనెటువైపూలేను" గోపినాయుడు.

"అంటే ఇంత తగలబడిపోతుంటే తప్పొప్పులు పట్టించుకోరా?"

"తప్పులు రెండువైపులా వున్నాయి" జవాబిచ్చేడు గోపినాయుడు.

"కాలనీల మనిషి చచ్చిపోడంతో అంత్యక్రియలుజేసి బయల్దేరడం ఆలస్యమయింది డప్పులోళ్లకి. అంతమాత్రానికే గవిరేశుమీద చెయ్యిజేస్తారా?"

"ఆ కబురేదో గవిరేశు తెల్లారేసరికి చెప్పొచ్చుగదా! పండగ! బంధువులూ, ఎదురుచూవులూ... ఎవరికయినా కోపమొస్తాది. మీరు చిల్లర విషయాల్లో ఘర్షణ పడుతన్నారు. ఆ విషయాలే అవతలివాళ్లని ఏకం చేస్తున్నాయి. గవిరేశుని కొట్టలేదు. అవును అవమానించేరు. ఎవరు? ఊరంతా కాదుగదా! క్షమాపణ అవమానించినోడు చెప్పాల. మరి మీరు డప్పులు బంద్‌చేసి ఊర్ని క్షమాపణ డిమాండ్ చేశారు. అదే డప్పులు తెచ్చి అనుపు పండుగ జరిపించేసి, ఆ తర్వాత పెద్దల మధ్య పంచాయితీ పెడితే బాగుండేది" గోపినాయుడు వివరించసాగేడు.

"అయితే అడుక్కుతిని బతికే పెంటడిని కొట్టొచ్చా? ధర్మమా అది?" కీచుగొంతుతో ప్రశ్నించేడు ఎర్నెస్ట్.

"కయ్యమారంభమయిపోతే ఇక అటూ ఇటూ గూడా తప్పులు జరుగుతాయి."

కూర్చున్న చోటునుంచి లేచేడు గోపినాయుడు.

చలం విజ్ఞాపన పత్రాన్ని ఎర్నెస్టుకి అందజేశాడు.

"కయ్యామాడవలసినకాడ వెనకడుగేస్తారు. ఒట్టొట్టి విషయాలకి కాలుదువ్వుతారు మీరు" పత్రంవైపు చూస్తూ పలికేడు గోపినాయుడు.

"ఎక్కడ వెనకడుగేశాం?" ప్రశ్నించాడు ఎర్నెస్టు.

"రెయ్యమ్మ భూమికాడ" సూటిగా చెప్పేడు గోపినాయుడు. ఎర్నెస్టు వెంటనే ఏమీ బదులు చెప్పలేకపోయాడు.

"కలక్టర్ దళితం అన్నావు. ఏట్లాభం? రెయ్యమ్మకీ, కలెక్టర్‌కీ తేడా లేకపోయింది. రాజ్జేనికీ, ఐశ్వర్యానికీ సుట్టరికం. అది ఒకే కులం. ఆ! కాయితాల్తోటి కలెక్టర్ బదిలీ ఆపగలిగినా, రెయ్యమ్మకి భూమిని ఇప్పించలేరు. ఆ కలెక్టరే ఇప్పించలేదు. ఇన్నాళ్లబట్టి అక్కడది నిరాహారదీక్ష చేసినా, సుడివొక్కాడ, సురక మరొక్కాడ. ఇవీ మన పోరాటాలు" తువ్వాలు ఓ దులుపు దులిపి, భుజమ్మీద వేసుకొని అక్కడినుంచి వెళ్లిపోయేడు గోపినాయడు.

ఎర్నెస్టు, అతనితో వచ్చిన యువకులూ ఓ క్షణం గోపినాయుడి మాటల్ని పునఃపరిశీలనజేసి, ఏ స్పందనా వ్యక్తం చెయ్యకుండా అక్కడినుంచి కదిలేరు.

చలానికి మాత్రం ఏదో యెరుకయ్యింది. అధికారం, ఐశ్వర్యం, కులం... సర్పాల

ఆవాసమయిన వల్మీకమీసమాజం అని బోధపడింది. గోపినాయుడి 'సుడీ, చురకా' గురించి ఆలోచిస్తుండగా ఫోన్ మోగింది.

జీవరత్నం వ్యాసం కోసం చేసిన ఫోన్!

"వ్యాసం పూర్తిచేస్తాగానీ, నువ్వు ఆస్పత్రికి వెళ్లి నిరాహారదీక్ష చేస్తోన్న రెయ్యమ్మను తీసుకొని ఇక్కడకు రావాలి. అవును నీ కోసం ఎదురు చూస్తాను" అని చెప్పి ఫోన్ పెట్టేసి చకచకా వ్యాసం రాయసాగేడు చలం! ★

*'విపుల' మాసపత్రిక, ఫిబ్రవరి 2000*